సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 11 । డిసెంబర్ । 2023



జూకి భారీగా ఆదాయం

కార్తీకమాసం ఆఖరి ఆదివారం విశాఖలోని జంతు ప్రదర్శనశాల సందర్శకులతో కిటకిటలాడింది. 8లో



సాగరంలో సంబరం

విశాఖ ఆర్‌కేబీచ్‌లో ఆదివారం జరిగిన తూర్పు నౌకాదళ విన్యాసాలు సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాయి. 8లో



మోదమ్మకు ప్రత్యేక పూజలు

పాడేరు మోదకొండమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. 9లో

న్యూస్‌రీల్

భక్తిశ్రద్ధలతో త్రిమూర్తులకు ప్రత్యేక పూజలు



త్రినాథస్వాములకు పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు రామం, మహిళా భక్తులు

సాక్షి,పాడేరు: పట్టణంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన త్రిమూర్తుల విగ్రహాల వద్ద ఆదివారం సాయంత్రం నుంచి త్రినాథస్వాముల సాముహిక మేళాను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.వర్తక సంఘం ప్రతినిధి సత్యవరపు రాము,సునీత దంపతులు లోక కళ్యాణార్థం ఈ కార్యక్రమం నిర్వహించారు.ఆలయ ప్రధాన అర్చకుడు రామం పంతులు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. పూజా కార్యక్రమాల అనంతరం ప్రసాదం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, ఆధ్యాత్మిక కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

500 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు



జడ్డంగిలో కొనుగోలు చేస్తున్న ధాన్యం

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి కొనుగోలు కేంద్రం ద్వారా ఆదివారం తొలిసారిగా రైతుల నుంచి 500 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు మండల వ్యవసాయాధికారి రమేష్‌నాయుడు తెలిపారు. ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించామని చెప్పారు. మండలంలో రాజవొమ్మంగి, జడ్డంగి, శరభవరం, కొమరాపురం, లబ్బర్తి, దూసరపాము గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఆయన పేర్కొన్నారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అనారోగ్యంతో కేజీబీవీ విద్యార్థిని మృతి



కమల (ఫైల్)

జి.మాడుగుల: స్థానిక కస్తూర్బా విద్యాలయానికి చెందిన విద్యార్థిని పాంగి కమల అనారోగ్యంతో మృతి చెందింది. ఏడవ తరగతి చదువుతున్న ఈమె చర్మ వ్యాధితో బాధపడుతుండగా పాఠశాల యాజమాన్యం స్థానిక పీహెచ్‌సీలో వైద్యం అందించింది. అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు అక్టోబర్‌లో మండలంలోని స్వగ్రామం నక్కమెట్టకు ఆమెను తీసుకువెళ్లిపోయారు. దసరా తరువాత కూడా ఆమె పాఠశాలకు రాలేదు. విపరీతమైన దగ్గు, గుండెల్లో మంట లక్షణాలతో బాధపడుతున్న ఆమెను శుక్రవారం పాడేరు ఆస్పత్రికి తీసుకువెళ్లగా వైద్య పరీక్షలు నిర్వహించారు. గుండెకు రంధ్రం ఉన్నందున విశాఖ కేజీహెచ్‌కు తీసుకువెళ్లాలని తల్లిదండ్రులకు వైద్యులు సూచించారు. ఇందుకు అవసరమైన డబ్బులు సమకూర్చుకునేందుకు అక్కడి నుంచి విద్యార్థినితో తల్లిదండ్రులు రాజారావు, రాజులమ్మ స్వగ్రామం నక్కమెట్ట వచ్చారు. ఇంతలోనే విద్యార్థిని ఆరోగ్య విషమించడంతో ఆదివారం ఇంటివద్దనే విద్యార్థిని కమల మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

పర్యాటకులకు 'రక్షణ' కరువు



రెయిలింగ్ లేని ప్రాంతంలో సెల్ఫీలు దిగుతున్న పర్యాటకులు

రంపచోడవరం : మారేడుమిల్లి సమీపంలోని ఘాట్‌రోడ్‌లో ఏర్పాటుచేసిన వ్యూ పాయింట్ ప్రమాదకరంగా మారింది. దిగువ ప్రాంతంలోని ఘాట్‌రోడ్‌లో అందాలు తిలకించేందుకు ఎత్తయిన ప్రాంతంలో ఈ వ్యూ పాయింట్‌ను ఏర్పాటుచేశారు. ఐరన్‌తో ఉన్న ఈ వ్యూ పాయింట్‌కు పర్యాటకుల భద్రత నిమిత్తం స్టీలుతో రెయిలింగ్‌ను ఏర్పాటు చేశారు. గతంలో రెయిలింగ్‌ను దొంగలు తస్కరించగా ఇటీవల మరోమారు రెయిలింగ్‌ను బిగించారు. దానిని కూడా దొంగలు చోరీ చేయడంతో వ్యూ పాయింట్ వద్ద పర్యాటకులకు భద్రత లేకుండా పోయింది. పర్యాటకులు అత్యుత్సాహంతో ఐరన్ ప్లాట్‌ఫాం చివరివరకు వెళ్లి సెల్ఫీలు దిగుతున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు లోయలోకి పడిపోయే అవకాశముందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వ్యూ పాయింట్ వద్ద రెయిలింగ్‌ను ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

గిరి సీమలో పట్టు సిరులు

జిల్లాలో విలీన మండలాలైన కూనవరం, చింతూరు, వీఆర్‌పురం మండలాల్లో దసలి పట్టుకాయలు, వాటి గుడ్ల పెంపకం మంచి ఆదాయాన్నిస్తోంది. ఏడాదిలో మూడు విడతలుగా ఉత్పత్తి చేస్తూ గిరి మహిళలు ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారు.

- సహజ పద్ధతిలో ఉత్పత్తి
- దసలికాయలు, గుడ్లతో అధిక ఆదాయం
- చింతూరు డివిజన్‌లో మాత్రమే టస్సార్ కేంద్రాలు
- సెంట్రల్ సిల్క్‌బోర్డు, సెరీకల్చర్ శాఖ సహకారం



మద్దిచెట్టు నుంచి పురుగులను సేకరిస్తున్న రైతు



పట్టుగుడ్ల ఉత్పత్తిలో నిమగ్నమైన గిరిజన మహిళలు

చింతూరు: గిరిసీమలో దసలి పట్టుకాయలు, వాటి గుడ్ల ఉత్పత్తి ద్వారా గిరిజన రైతులు అధిక ఆదాయం పొందుతున్నారు. రాష్ట్రంలోని చింతూరు డివిజన్లలో కూనవరం, చింతూరు, వీఆర్‌పురం మండలాల్లోనే సహజ పద్ధతిలో దసలి పట్టుకాయలు, గుడ్లను ఉత్పత్తి చేస్తున్నారు. మూడు మండలాల్లో 800 కుటుంబాలకు చెందిన 1,600 మంది గిరి రైతులు ఏడాదిలో మూడు విడతలుగా పట్టుకాయలను ఉత్పత్తి చేస్తుండగా, పది కేంద్రాల ద్వారా 50 మంది మహిళలు పట్టుగుడ్లను ఉత్పత్తి చేస్తున్నారు. గిరిరైతులకు సెంట్రల్ సిల్క్‌బోర్డు, సెరికల్చర్ శాఖ అండగా నిలుస్తూ అడవిబిడ్డల జీవనాధారానికి ఆసరాగా ఉంటున్నాయి. దసలిపట్టు కాయల నుంచి వచ్చే దారంతో నాణ్యమైన పట్టు వస్త్రాలను తయారు చేస్తారు.

ఉత్పత్తి ఇలా..

దసలి పట్టుకాయలను మొదటి విడతగా జూన్, జూలై నెలల్లో 450 మంది బ్యాచ్‌గా 35 రోజుల పాటు, రెండో విడతగా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో 800 మంది బ్యాచ్‌గా 40 నుంచి 45 రోజులపాటు, మూడో విడతగా నవంబరు, డిసెంబరు నెలల్లో 500 మంది బ్యాచ్‌గా 50 నుంచి 55 రోజులపాటు ఉత్పత్తి చేస్తున్నారు. ముందుగా కాయలను(కకూన్స్) అనంతరం గుడ్లను ఏటా ఉత్పత్తి చేయడం నిరంతర ప్రక్రియ.

ఒక్కో రైతుకు 200 గుడ్లు..

సెంట్రల్ సిల్క్‌బోర్డు ఆధీనంలోని బస్తర్, నవరంగ్పూర్, బండారా, బిలాస్‌పూర్, చెన్నూరు, రంపచోడవరం వంటి ప్రాంతాల నుంచి ప్రతి ఏడాది 80 వేల పట్టుగుడ్లను తీసుకొచ్చి ఒక్కో రైతుకు 200 గుడ్లను ఇస్తున్నారు.

గుడ్ల ఉత్పత్తికి కేంద్రాలు

చింతూరు డివిజన్లోని చింతూరు మండలంలో ఎర్రంపేట, సింగన్నగూడెం, ఏడుగురాళ్లపల్లి, బొడ్డుగూడెం, పెదశీతనపల్లి, కూనవరం మండలంలో సీతారాంపురం, మంగళ్లగూడెం, పైడిగూడెం, బోదునూరులో గుడ్లఉత్పత్తి కేంద్రాలున్నాయి. ఒక్కో కేంద్రంలో ఐదుగురు గిరిజన మహిళలు పట్టుగుడ్లను ఉత్పత్తి చేస్తున్నారు.

మార్కెటింగ్ ఇలా

సెంట్రల్ సిల్క్‌బోర్డు ద్వారా తెచ్చిన 80 వేల గుడ్ల ద్వారా 18 లక్షల పట్టుకాయలు ఉత్పత్తి అవుతాయి. వీటిలో 8 లక్షల కాయలను రైతులు వేలంపాట ద్వారా ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులకు విక్రయిస్తారని పట్టు పరిశ్రమశాఖ అధికారులు తెలిపారు.

- ఈ ఏడాది ఒక్కో పట్టుకాయకు రూ.3.60 ధర పలికిందని 8 లక్షల కాయలకు రూ.28 లక్షల వరకు ఆదాయం సమకూరిందని గిరి మహిళలు తెలిపారు. రైతుల వద్ద మిగిలిన 10 లక్షల పట్టుకాయలను మూడు మండలాల్లోని 10 గుడ్ల ఉత్పత్తి కేంద్రాలకు చెందిన మహిళలకు ఒక్కో కేంద్రానికి లక్ష చొప్పున అందచేస్తామని, ఒక్కో కేంద్రం ద్వారా 20 వేల గుడ్లు ఉత్పత్తి అవుతాయని అధికారులు తెలిపారు. మహిళలు ఒక్కో గుడ్డును రూ.16 చొప్పున తిరిగి రైతులకు విక్రయించడం ద్వారా రూ 3.20 లక్షల వరకు ఆదాయం వస్తుందని వారు తెలిపారు. దానిలో రూ.2 లక్షలను కాయలు అమ్మిన రైతులకు చెల్లించాల్సి ఉంటుందని మిగతా రూ. 1.20 లక్షలను ఐదుగురు సభ్యులు పంచుకుంటారని, ఇలా ఏడాదిలో మూడు విడతలుగా గిరిజన రైతులకు ఆదాయం లభిస్తుందని అధికారులు పేర్కొన్నారు.
- పట్టుకాయల పెంపకం ద్వారా ఒక్కో రైతు ఏడాదికి రూ.60 వేల నుంచి రూ. 80 వేలు, గుడ్ల ఉత్పత్తి ద్వారా ఒక్కో మహిళ ఏడాదికి రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు ఆదాయం పొందుతారని వారు అధికారులు పేర్కొన్నారు.

- మరోవైపు ఐటీడీఏ ద్వారా పట్టుకాయల నుంచి దారంతీసే ప్రక్రియలో గిరిజన మహిళలకు శిక్షణ నిచ్చి, మార్కెటింగ్ చేయడం ద్వారా అదనపు ఆదాయం సమకూర్చేలా ప్రణాళికలు చేస్తున్నామని తెలిపారు.

ఆదాయం కల్పించడమే ప్రధాన లక్ష్యం



డివిజన్‌లో గిరిజనులకు ఆదాయం కల్పించడమే ప్రధాన లక్ష్యంగా దసలి పట్టుకాయలు, గుడ్ల ఉత్పత్తిని చేపడుతున్నాం. ఇప్పటికే ఐటీడీఏ ద్వారా మహిళలకు దారం తయారీలో శిక్షణ ఇవ్వడం జరిగింది. దీనిద్వారా అదనపు ఆదాయం సమకూరేలా ప్రయత్నిస్తున్నాం. – పిన్నమనేని రాంబాబు, సెరీకల్చర్ అధికారి, చింతూరు



సీతాకోక చిలుకలను వేరు చేస్తున్న మహిళ

ఏటా మంచి ఆదాయం



పట్టుగుడ్ల ఉత్పత్తి ద్వారా ప్రతి ఏడాది మంచి ఆదాయం లభిస్తోంది. ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటుతో మా కుటుంబాల పోషణకు ఎంతో ఉపయోగంగా ఉంటోంది.

– నీలం కన్నమ్మ, భగవానపురం, కూనవరం మండలం

పెరిగిన ధర



గతంలో కాయల ధర రూ.2 ఉండేది. ఈ ఏడాది వేలం పాటలో రూ 3.60కు వ్యాపారులు కొనుగోలు చేస్తారు. ఎంతో కష్టపడి ఉత్పత్తి చేస్తున్న తమకు మంచిధర వస్తోంది.

– సీతారామయ్య, అభిచర్ల, కూనవరం మండలం

సంతారి గెడ్డలో మహిళ మృతదేహం లభ్యం

- పనసపుట్టుకు చెందిన భీమాలమ్మగా గుర్తింపు



సంతారి గెడ్డ ఒడ్డున తేలిన భీమాలమ్మ మృతదేహం

సాక్షి, పాడేరు: హుకుంపేట మండలం సంతారి గెడ్డను దాటుతుండగా గిరిజన మహిళ కొట్టుకుపోయి మృతి చెందింది. ఆదివారం పనసపుట్టు గ్రామానికి చెందిన ఏడేల భీమాలమ్మ (55) ఆదివారం ఉదయం సమీపంలో ఉన్న సంతాడ గ్రామం బయలుదేరింది. మార్గంమధ్యలో సంతారి గెడ్డను దాటుతుండగా ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోయింది. వెంటనే గాలించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. ఆమె మృతదేహం చింతలవీధి ప్రాంతంలో గెడ్డ ఒడ్డున తేలింది. దుస్తులు ఉతికేందుకు గెడ్డ వద్దకు వెళ్లిన మహిళలు మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే గ్రామస్తులంతా అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఇక్కడికి సమీపంలో పనసపుట్టు గ్రామానికి చెందిన ఏడే భీమాలమ్మ మృతదేహంగా వారు గుర్తించారు. హుకుంపేట ఎస్‌ఐ సతీష్ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం పనసపుట్టులోని బంధువులకు అప్పగించారు. మృతురాలి భర్త భీమన్న గతంలో మృతిచెందాడు. వీరికి ముగ్గురు ఆడపిల్లలు. వీరిలో ఇద్దరికి వివాహం జరిగింది. మూడవ కుమార్తెతో కలిసి భీమాలమ్మ పనసపుట్టులో జీవిస్తోంది.

14న అప్పన్న దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సమావేశం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సమావేశం ఈనెల14న నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే 27 అంశాలతో రూపొందించిన అజెండాను ట్రస్ట్‌బోర్డు సభ్యులకు అధికారులు పంపించారు. శ్రీ కృష్ణాపురంలోని గోశాలలో ఆరోజు ఉదయం 10.30 నుంచి నిర్వహించనున్నారు. ఈసారి కూడా ఇంజినీరింగ్ పనులకు సంబంధించిన అంశాలే ఎక్కువగా అజెండాలో పొందుపరిచారు.

పరిశోధనలు ఫలిస్తే గిరి రైతులతో కుంకుమ పువ్వు సాగు

- ఎమ్మెల్సీ రవిబాబు
- చింతపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్ సందర్శన



పరిశోధన స్థానంలో కుంకుమపువ్వు సాగును పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కుంభా రవిబాబు

చింతపల్లి రూరల్: స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు చేపడుతున్న ప్రయోగాత్మకంగా చేపట్టిన కుంకుమ పువ్వు సాగు ఫలిస్తే గిరి రైతులకు సాగుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ కుంభా రవిబాబు అన్నారు. ఆదివారం ఆయన స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానాన్ని సందర్శించారు. శాస్త్రవేతలు ప్రయోగాత్మకంగా గ్లాస్ హౌస్‌లో చేపట్టిన కుంకుమ పువ్వు సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధి కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. కుంకుమ పువ్వు సాగు తొలి ఏడాది విజయవంతం కావడంపై కీలక భూమిక పోషించిన పరిశోధన స్థానం ఏడీఆర్ సురేష్‌కుమార్‌ను అభినందిస్తున్నట్టు చెప్పారు. గిరిజనులకు అధిక ఆదాయం సమకూర్చే పంటలపై ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు.గంజాయి పంటకు ప్రత్యామ్నాయంగా గిరిజనులకు 90 శాతం రాయితీపై రాజ్‌మా విత్తనాలు, కాఫీ రైతులకు గిట్టుబాటు ధర అందిస్తోందన్నారు. కుంకుమపువ్వు ప్రయోగాత్మకంగా పూర్తి స్థాయిలో విజయవంతమైతే గిరిజన ప్రాంత వ్యవసాయంలో పెను మార్పు చోటు చేసుకుంటుందన్నారు.అత్యధిక ఆదాయం సమకూర్చే పంటగా గిరిజన ప్రాంతాల్లో కుంకుమ పువ్వు ప్రత్యేక స్థానాన్ని ఏర్పర్చుకుంటుదన్నారు.పరిశోధన స్థానంలో పూల సాగు సంతృప్తికరంగా ఉందని, గ్లాడియోలస్,లిల్లియం,చైనాఆస్టర్, జర్బరా పూల దిగుబడి బాగుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాస్త్రవేత్త వంశీకృష్ణ పాల్గొన్నారు.

రోడ్‌షోను విజయవంతం చేయండి



రోడ్డుషో వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాజవొమ్మంగి: మండలంలో ఈ నెల 14, 16 తేదీల్లో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ నేతృత్వంలో జరుగనున్న వైఎస్సార్‌సీపీ రోడ్ షోను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ కోరారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ వసతి గృహంలో రోడ్ షోకు సంబంధించి గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల, 9 నెలల కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తారన్నారు. ఇంకా ఏవైనా సమస్యలు వుంటే రోడ్ షోలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తారని ఆయన పేర్కొన్నారు. 14వ తేదీన మండలంలోని వట్టిగెడ్డ, శరభవరం, కింద్ర మీదుగా లబ్బర్తి, 16వ తేదీన బలిజపాడు, వంచంగి, కరుదేవపాలెం, చికిలింత, కొమరాపురం, అమీనాబాద్ మీదుగా జడ్డంగి చేరుకుంటుందన్నారు. అడ్డతీగల జెడ్పీటీసీ మద్దాల వీర్రాజు, మండల నాయకులు దాట్ల వెంకటేష్‌రాజు, కొంగర మురళీకృష్ణ, చీడిపల్లి అప్పారావు, బొడ్డు వెంకటరమణ, శాంతకుమారి, కనిగిరి గంగదుర్గ, అడపా కామేష్, చీడి శివ, చింతలపూడి వెంకటరమణ, కుశరాజు, జ్ఞానేశ్వర్, చంద్రరావు, కనిగిరి రాజుబాబు, అధికారి సత్యనారాయణ, మంతెన ముసలయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



అటవీ శాఖ సిబ్బందితో మాట్లాడుతున్న ఏపీఎఫ్‌డీసీ ఎండీ నాయక్

చింతపల్లి రూరల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఏపీఎఫ్‌డీసీ ఎండీ, సీసీఎఫ్ (ఐటీ) ఏకే నాయక్ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక డివిజనల్ అటవీశాఖాధికారి కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి జిల్లా ఏర్పడిన తరువాత డివిజనల్ కార్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ తీసుకుందన్నారు. సుమారు 70 శాతం అడవి కలిగిన గిరిజన ప్రాంతాన్ని సంరక్షించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. అటవీ సిబ్బందికి వారి విధుల పట్ల అవగాహన కల్పించారు. సిబ్బంది నుంచి సమస్యలు తెలుసుకున్నారు. కృష్ణాపురంలో నిర్మిస్తున్న ఎకో టూరింజం ప్రాజెక్ట్‌ను సందర్శించారు. దీనిని నెలాఖరుకల్లా పర్యాటకులకు అందుబాటులోకి తెస్తామన్నారు. డీఎఫ్‌వో సూర్యనారాయణ పడాల్, సబ్ డీఎఫ్‌వో వెంకటరాజు, రేంజి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా మారథాన్ పోటీలు



అంతర్జాతీయ మారథాన్ పోటీలకు హాజరైన యువతీ యువకులు



పోటీల్లో యువకులు



పతకాలతో విజేతలు

సాక్షి,పాడేరు: రన్ అల్‌ట్రైబ్ పాడేరు–2023 పేరిట వంజంగి ప్రాంతంలో ఆదివారం అంతర్జాతీయ మారథాన్ పోటీలు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాలతోపాటు నార్వే, కెనడా దేశాలకు చెందిన యువతీ యువకులు పాల్గొన్నారు. విశాఖకు చెందిన ఓ ప్రైవేట్ సంస్థ వివిధ విభాగాల్లో ఈ పోటీలను నిర్వహించింది. ఎముకల కొరికే చలిని సైతం లెక్కచేయకుండా ఉత్సాహంగా పాల్గొన్నారు. పాడేరు,అరకులోయ ప్రాంతాలకు చెందిన యువకులు ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. విజేతలకు జ్ఞాపికలు, పతకాలు అందజేశారు.

పరవశించిన పర్యాటకం

- తెలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన సందర్శకులు
- థింసా నృత్యాలు చేస్తూ సందడి
- మంత్రముగ్ధులను చేసిన ప్రకృతి అందాలు



చాపరాయి జలపాతంలో స్నానాలు



కొత్తపల్లి జలపాతం వద్ద పర్యాటకుల సందడి



అరకులోయ సమీపంలోని మాడగడ హిల్స్‌పై గిరిజన మహిళల మాదిరిగా పర్యాటకుల ముస్తాబు



పాడేరు సమీపంలోని వంజంగి హిల్స్‌లో ప్రకృతి అందాలను వీక్షిస్తున్న పర్యాటకులు



అరకులోయ సమీపంలోని మాడగడ హిల్స్‌లో పొగమంచు అందాలను వీక్షిస్తున్న పర్యాటకులు



చెరువులవేనంలో పర్యాటకులు



అరకులోయ మండలం మాడగడ కొండ సమీపంలో పర్యాటకుల వాహనాల రద్దీ

సాక్షి,పాడేరు: జిల్లాలోని అన్ని పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులతో రద్దీ నెలకొంది. ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నా ఏమాత్రం తగ్గకుండా పొగమంచు, ప్రకృతి అందాలను వీక్షించేందుకు తరలివస్తున్నారు. మారేడుమిల్లి, మోతుగూడెం, జీకేవీధి, చింతపల్లి, జి.మాడుగుల, పాడేరు, హుకుంపేట, డుంబ్రిగుడ, అరకులోయ, అనంతగిరి మండలాల్లోని పర్యాటక ప్రాంతాలు ఆదివారం కిటకిటలాడాయి. అరకులోయలోని మాడగడ హిల్స్ రోడ్డుకు దగ్గరగా ఉన్నందున ప్రకృతి అందాలను వీక్షించేందుకు సందర్శకులు ఆసక్తి చూపారు. గిరిజన మహిళలతో కలిసి థింసా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. పర్యాటకులు కూడా గిరిజన మహిళల కట్టుబొట్టుతో ముస్తాబై ఫొటోలు,వీడియోలు తీసుకున్నారు. గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్లకు పర్యాటకుల తాకిడి నెలకొంది. పాడేరు మండలం వంజంగి హిల్స్, చింతపల్లి మండలంలోని చెరువులవేనం ప్రాంతాలకు పర్యాటకులు భారీగా తరలివచ్చారు. ఈ శిఖరాలపై సూర్యోదయం, పొగమంచు తెరలు, మేఘాల అందాలు పర్యాటకులను మంత్రముగ్ధులను చేశాయి. అలాగే జలపాతాల ప్రాంతాల వద్ద రద్దీ నెలకొంది. అతిశీతల ప్రాంతాలుగా గుర్తింపు పొందిన లంబసింగి, పాడేరు ఘాట్‌లోని మోదకొండమ్మ పాదాల గుడిలోని కాఫీ తోటల వద్ద పర్యాటకులు సందడి చేశారు. పర్యాటకుల వాహనాలతో మాడగడ, వంజంగి, చెరువులవేనంలో ట్రాఫిక్ సమస్య తలెత్తింది.

డుంబ్రిగుడ: మన్యంలో పర్యాటక ప్రాంతాలను తిలకించేందుకు మైదాన ప్రాంతం నుంచి ఆదివారం కుటుంబ సమేతంగా పర్యాటకులు తరలివచ్చారు. చాపరాయి జలపాతం, అంజోడ సిల్క్‌ఫారం, కోల్లాపుట్టు జలపాతం ప్రాంతాలు కిటకిటలాడాయి. అరకు–పాడేరు ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్ల నీడలో కుటుంబంతో వనభోజనాలు చేస్తూ ఉత్సాహంగా గడిపారు.

జి.మాడుగుల: మండలంలోని కొత్తపల్లి జలపాతం పర్యాటకులతో సందడిగా మారింది. కార్తీక మాసం కావడంతో వనభోజనాలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జలపాతం వద్ద సందడి చేశారు.

చింతపల్లిరూరల్: వీకెండ్ కావడంతో పర్యాటక కేంద్రమైన లంబసింగి చెరువులవేనం సందర్శకులతో కళకళలాడింది. తాజంగి రిజర్వాయర్ వద్ద జిప్‌లైన్, బోట్‌షికార్ చేస్తూ ఉత్సాహంగా గడిపారు.

క్లుప్తంగా

అథ్లెటిక్స్ పోటీల్లో ఉపాధ్యాయుల ప్రతిభ



పతకాలు సాధించిన వారిలో ఉపాధ్యాయుడు రాజు

ఎటపాక: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా 42వ రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో విలీన మండలాల ఉపాధ్యాయులు ప్రతిభ చాటారు. ఇటీవల వివిధ విభాగాల్లో జరిగిన పోటీల్లో పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. షాట్‌పుట్‌లో ఎస్.నాగిరెడ్డి , 400 మీటర్ల పరుగు పందెంలో కె.రాజు రజత పతకాలు సాధించారు. అదేవిధంగా పూజిత కాంస్య పతకం,1500 మీటర్ల పరుగు పందెంలో అనిల్ కాంస్యం, 800 మీటర్లలో శైలజ కాంస్యం, 400 మీటర్ల రిలేదీక్షల్లో రిలేలో విజయకుమారి కాంస్యం సాధించారు. ట్రిపుల్ జంప్‌లో సునీత కాంస్య పతకం సాధించారు. వీరంతా ముంపు మండలాల నుంచి ఎంపిక కావడంతో అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యునికి ఘన స్వాగతం

ఉక్కునగరం: జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు సుభాష్ రామనాథ్ పార్థికి స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు ఘన స్వాగతం పలికారు. విశాఖలో రెండు రోజుల పర్యటన నిమిత్తం ఆదివారం సాయంత్రం విచ్చేసిన ఆయనకు విమానాశ్రయంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, అధ్యక్షుడు బి.తౌడన్న, తదితరులు శాలువా కప్పి, బొకే అందజేసి, ఆహ్వానం పలికారు. 12న స్టీల్‌ప్లాంట్, ఓఎన్‌జీసీ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్లు, ఆయా సంస్థల యాజమాన్యాలతో సమావేశం కానున్నారు. స్వాగతం పలికిన వారిలో అసోసియేషన్ నాయకులు ఎస్.సత్యనారాయణ, ఎల్.వి.రమణారావు, ఎస్.మోహన్‌బాబు, డి.పుల్లారావు, కె.వి.రత్నం, తదితరులు పాల్గొన్నారు.

సాగరంలో సంబరం





గౌరవవందనం స్వీకరిస్తున్న గవర్నర్ నజీర్

- అబ్బురపరిచిన నేవీ విన్యాసాలు
- పరాక్రమాన్ని చూపిన తూర్పు నావికాదళం
- ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ నజీర్
- సందర్శకులతో కిటకిటలాడిన సాగరతీరం

బీచ్‌రోడ్డు: సాగర జలాల్లో యుద్ధ నౌకల కవాతు.. గగనతలంలో హెలికాప్టర్ల పహారా.. శత్రుమూకలపై మార్కోస్ ఉప్పెనలా దాడి.. దూసుకొచ్చిన మిసైల్స్.. దానితో పోటీ పడేటట్లుగా మెరుపు వేగంతో వెళ్లిన యుద్ధ విమానాలు.. మొత్తంగా ఆర్.కె.బీచ్ రణరంగాన్ని తలపించింది. ఒళ్లు గగుర్పొడిచేలా నిర్వహించిన నేవీ విన్యాసాలు.. ఉవ్వెత్తున ఎగిసిపడిన జనసంద్రం నడుమ ఉద్వేగాన్ని, ఉత్సాహాన్ని నింపాయి. నింగి, నేలా తేడా లేదనేలా సాగిన విన్యాస ప్రదర్శనను ప్రత్యక్షంగా తిలకించిన ప్రజలు.. సరికొత్త అనుభూతిని పొందారు. నేవీ డే పురస్కరించుకుని ఆర్.కె. బీచ్‌లో ఆదివారం జరిగిన తూర్పు నౌకాదళ విన్యాసాలు సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాయి. ముందుగా సభా వేదిక వద్ద ముఖ్య అతిథులు గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌లను తూర్పు నావికాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ స్వాగతం పలికారు. అనంతరం త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించేలా మూడు బాంబులను పేల్చి విన్యాసాలను ప్రారంభించారు.

కిటకిటలాడిన తీరం

నేవీ విన్యాసాలు చూసేందుకు ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ప్రజలు లక్షలాదిగా తరలిరావడంతో తీరంలో పండగ వాతావరణం నెలకొంది. కోస్టల్ బ్యాటరీ నుంచి వైఎంసీఏ వరకు తీరంలో



తీరానికి వస్తున్న మార్కోస్

ఇసుకేస్తే రాలనంత జనం కనిపించారు. కొందరు ప్రత్యక్షంగా.. మరికొందరు ఎల్‌ఈడీ స్క్రీన్లపై విన్యాసాలను తిలకించారు.

పటిష్ట ఏర్పాట్లతో విజయవంతం

లక్షలాది మంది ప్రేక్షకులు విన్యాసాలను చూసేందుకు వస్తారని అంచనా వేసిన అధికారులు, పోలీసులు అందుకు తగ్గట్లుగా భారీ ఏర్పాట్లు చేశారు. ఎవరికి ఎటువంటి ఇబ్బంది లేకుండా గ్యాలరీలను ఏర్పాటు చేయడంతో పాటు తాత్కాలిక మరుగుదొడ్లు, మంచినీటి సదుపాయాలు కల్పించారు. ప్రతీ గ్యాలరీ వద్ద పోలీసులను ఏర్పాటు చేసి ప్రేక్షకులను నియంత్రించారు. విన్యాసాలను చూసేందుకు వచ్చినప్పుడు, తిరిగి వెళ్లేటప్పుడు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఎక్కడికక్కడ ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టారు.



బాంబుల మోత



విన్యాసాలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తున్న ప్రేక్షకులు



హాక్ విమానాల విన్యాసం



జనసంద్రంగా సాగరతీరం







జాతీయ పతాకంతో స్కై డైవ్ చేస్తున్న సైనికులు



స్కై డైవింగ్

ప్రదర్శన సాగిందిలా..

- సముద్రం నుంచి తీరం వైపునకు ఐదు హాక్స్ యుద్ధ విమానాలు దూసుకొచ్చి బాంబుల వర్షం కురిపించాయి.
- నిశ్శబ్దంగా దూసుకొచ్చిన ఐఎన్ఎస్ సింధుశాస్త్ర సబ్‌మెరైన్ నుంచి సెయిలింగ్ పాస్ట్ నిర్వహించారు.
- ఆయిల్ రిగ్‌ను పేల్చేందుకు ఓ హెలికాప్టర్‌లో మార్కోస్ వచ్చి తాడు సాయంతో చిన్న బోట్లలోకి దిగారు. అనంతరం రిగ్‌కు బాంబులు అమర్చారు. మళ్లీ హెలికాప్టర్ ఎక్కి రిమోట్ ద్వారా ఆయిల్ రిగ్‌ను పేల్చి.. సందర్శకులకు సరికొత్త అనుభూతిని అందించారు.
- ఉగ్రవాదుల వద్ద బందీగా ఉన్న ప్రజలను రక్షించే ప్రదర్శన ఒళ్లు గగుర్పొడిచేలా సాగింది. మార్కోస్ ఉగ్రవాదులపై విరుచుకుపడి ప్రజలను రక్షించారు.
- రెండు యుద్ధ ట్యాంకర్లతో శత్రుసేనపై దాడి చేసిన విన్యాసాలు ఆకర్షణగా నిలిచాయి.
- యుద్ధం జరిగే సమయంలో నౌకలపై అత్యవసరంగా హెలికాప్టర్లను ఎలా ల్యాండ్ చేస్తారో చేసి చూపించారు. కదులుతున్న మూడు నౌకలపై మూడు హెలికాప్టర్లను విజయవంతంగా ల్యాండ్ చేశారు. అనంతరం యుద్ధ నౌకల నుంచి రాకెట్లను ప్రయోగించారు.
- ప్రమాదవశాత్తూ సముద్రంలో చిక్కుకున్న వారిని మూడు చేతక్ హెలికాప్టర్లపై సైనికులు వచ్చి రక్షించిన ప్రదర్శన అద్భుతంగా సాగింది.
- అనంతరం తూర్పు నావికాదళానికి చెందిన ఆయుధ సంపత్తిని ప్రదర్శించారు. గగనతలంలో యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు చేసి విన్యాసాలను సందర్శకులు కళ్లార్పకుండా చూశారు.
- నేవీ బ్యాండ్ ప్రదర్శన ఆకట్టుకుంది. చివరిగా యుద్ధ నౌకల్లో విద్యుత్ దీపాలను వెలిగించి విన్యాసాలు ముగించారు.

జూకి భారీగా ఆదాయం



జూలో సందర్శకులు

ఆరిలోవ: కార్తీకమాసం ఆఖరి ఆదివారం జూ పార్కు సందర్శకులతో కిటకిటలాడింది. నగరంలో పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో సందర్శకులు జూను సందర్శించి.. రోజంతా సరదాగా గడిపారు. పిల్లలు, పెద్దలు, పాఠశాల విద్యార్థులు ఇక్కడ పిక్నిక్‌లు జరుపుకున్నారు. అమెరికన్ చిలకలు, నెమళ్లు, ఆస్ట్రిచ్‌లు, ఈమూలు వాటి అరుపులతో పిల్లలను అలరించాయి. పులులు, సింహాలు, ఏనుగులు, కోతులు, చింపాజీలు, ఎలుగుబంట్లు వాటి ఎన్‌క్లోజర్లలో హుషారుగా తిరుగుతూ సందర్శకులను ఆకట్టుకున్నాయి. జింకలు చెంగుచెంగున గెంతులు వేస్తూ సందడి చేశాయి. ఆదివారం ఒక్క రోజు 10,109 మంది జూను సందర్శించినట్లు క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు. వారి ద్వారా రూ 7.89లక్షల ఆదాయం సమకూరినట్లు వెల్లడించారు.

నవ్వులు పూయించిన ఎల్‌బీ శ్రీరామ్



మాట్లాడుతున్న ఎల్‌బి శ్రీరామ్

సీతమ్మధార : ప్రముఖ రచయిత, సినీనటుడు, నాటకకర్త, దర్శకుడు ఎల్‌బీ శ్రీరామ్‌తో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో నవ్వులు పువ్వులు విరిశాయి. ఈ మేరకు ప్రముఖ అంతర్జాతీయ సాహిత్య సంస్థ నవసాహితి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం హోటల్ స్మార్ట్ ఇన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎల్‌బీ శ్రీరామ్ పాల్గొన్నారు. సాహిత్యపరమైన అంశాలతోపాటు రచయితగా, యూట్యూబర్‌గా తన అనుభవాలను పంచుకున్నారు. మరచిపోలేని సంఘటనలను ముఖాముఖిలో వివరించారు. ప్రముఖ నటుడు, సాహితీవేత్త గొల్లపూడి మారుతీరావు స్మారక పురస్కారం అందుకోవడానికి నగరానికి వచ్చిన ఆయన సాహితీవేత్తలు, పాత్రికేయులు, కళాకారులు అడిగిన ప్రశ్నలకు హుందాగా, చమత్కారంగా సమాధానం చెప్పి వేదికను ఆహ్లాదకరంగా మార్చారు. నవసాహితీ ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్‌వీ సూర్యప్రకాశరావు అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సమావేశంలో ఏ.నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

గోస్తనీ నదిలో విద్యార్థి గల్లంతు



హరి (ఫైల్)



రోదిస్తున్న తల్లి, కుటుంబ సభ్యులు

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ కురపల్లి చెక్ డ్యామ్ వద్ద ఆదివారం స్నానానికి దిగిన ఇంటర్ విద్యార్థి గల్లంతైనట్టు ఎస్ఐ జె.సురేష్ తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. పీఎం పాలెం గాయత్రినగర్‌కు చెందిన ఎనిమిది మంది మహిళలు, ఐదుగురు పురుషులు కలిసి ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఆటోలో కురపల్లి పిక్నిక్‌కు వచ్చారు. వీరిలో పొన్నగంటి హరి (16)తోపాటు ముగ్గురు చెక్ డ్యామ్ వద్ద గోస్తనీ నదిలోకి స్నానానికి దిగారు. ఈ క్రమంలో హరి నదిలో గల్లంతయ్యాడు. మిగతా ఇద్దరు ఒడ్డుకు చేరుకుని కుటుంబ సభ్యులకు విషయం చెప్పారు. విషయం తెలుసుకున్న పాండ్రంగి గ్రామానికి చెందిన జాలర్లు, కురపల్లి గ్రామస్తులు నదిలో హరి కోసం సాయంత్రం ఐదు గంటల వరకు గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు ఎస్ఐ సురేష్ తెలిపారు. గాయత్రినగర్‌కు చెందిన పొన్నగంటి అప్పారావు, రమణమ్మ దంపతులకు హరి, ఉదయ్ ఇద్దరు కుమారులు సంతానం. వీరిలో రెండోవాడైన హరి మద్దిలపాలెం కృష్ణా కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఉదయ్ పాలిటెక్నికల్ చదువుతున్నాడు. తండ్రి అప్పారావు స్థానిక బీసీ హాస్టల్‌లో హెల్పర్‌గా పని చేస్తున్నాడు. హరి, ఉదయ్ చక్కగా చదువుకుని ప్రయోజకులై తమకు అండగా నిలుస్తారని ఆశపడితే, ఇలా గల్లంతయ్యాడని తల్లి రమణమ్మ, గుండెలవిసేలా రోదిస్తున్నారు. ఆమెను ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు.

అనంతుని దీపోత్సవం.. సర్వపాపహరణం

- పద్మనాభుని దీపోత్సవానికి సర్వం సిద్ధం
- రేపు సాయంత్రం 5.30 గంటలకు దివ్య వెలుగులు



అనంతుని మెట్లు (ఇన్‌సెట్) స్వామి ఉత్సవ విగ్రహాలు

పద్మనాభం: భక్తులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న అనంత పద్మనాభుని దీపోత్సవం రానే వచ్చింది. ఈ నెల 12వ తేదీన ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. రాష్ట్రంలో ప్రత్యేకతను సంతరించుకున్న ఈ ఉత్సవాన్ని కనులారా వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్నారు. ఒకే చోట శైవ, వైష్ణవ ఆలయాలు ఉండడం పద్మనాభం ఆలయ ప్రత్యేకత. అనంత పద్మనాభుని ప్రాచీన దేవాలయాలు భారతదేశంలో రెండు చోట్ల ఉన్నాయి. ఒకటి కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురంలోను, రెండోది పద్మనాభం గ్రామంలోని గిరిపై ఉంది. ఎక్కడా జరగని రీతిలో ఏటా కార్తీక బహుళ అమావాస్య రోజున అనంత పద్మనాభుని కొండ మెట్ల పంక్తిపై దీపాలంకరణ ఉత్సవం అత్యంత వైభవోపేతంగా నిర్వహించడం ఆనవాయితీ. గిరి పాదం నుంచి గిరి శిఖరం వరకు 1,288 మెట్లు కిరువైపులా తైల దీపాలంకరణ కార్యక్రమం దిగ్విజయంగా నిర్వహిస్తూ హైందవ సంప్రదాయ విశిష్టతను ఎల్లెడలా వ్యాపింపజేస్తున్నారు. స్వామి దీపోత్సవంలో పాల్గొంటే సర్వపాపహరణం, స్వర్గలోకం ప్రాప్తిస్తుందని భక్తుల విశ్వాసం. మహిళలు తాము పుణ్యవతులు కావడానికి కార్తీక దీపోత్సవంలో పాల్గొనడమే ఉత్తమని భావిస్తారు. అందుకే దీపోత్సవం రోజు మధ్యాహ్నమే వీరు పద్మనాభం చేరుకుని దీపాలు వెలిగించడానికి కొండ మెట్లను పోటీ పడి మరి రిజర్వు చేసుకుంటారు. ఉత్సవం మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమవుతుంది. గిరిపైన జేగంట మోగగానే భక్తులు ఒక్కసారిగా దీపాలు వెలిగిస్తారు. శ్రీదేవి భూదేవి సమేతుడైన అనంత పద్మనాభుడు గిరి దిగువన ప్రథమ పావంచా వద్ద కొలువు దీరుతారు. గిరిని అధిరోహించే ముందు భక్తులు ప్రథమ పావంచా వద్ద కొలువై ఉన్న స్వామిని దర్శించుకుంటారు. ఉత్సవంలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఎమ్మెల్యే ముత్తంశెట్టి చొరవతో..

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో సింహాచలం దేవస్థానం అనంతుని దీపోత్సవానికి రూ.8లక్షలు కేటాయించింది. సింహాచలం దేవస్థానం అధికారుల సహకారంతో దీపోత్సవ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే గిరిపై ఉన్న ఆలయానికి, గిరి మెట్లకు, గిరి దిగువన ఉన్న కుంతీమాధవ స్వామి ఆలయానికి సున్నం వేశారు. మెట్లు కిరువైపులా తుప్పలు, డొంకలు తొలగించారు. దీపాలు వెలిగించడానికి అవసరమయ్యే 14 డబ్బాల నూనె, ఐదు వేల ప్రమిదలు, ఐదు వేల ఒత్తులు సమకూర్చారు. మెట్ల మార్గంతో పాటు ఘాట్ రోడ్డుపై నుంచి కొండ మీదకు వెళ్లడానికి, దిగడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఘాట్ రోడ్డు పక్కన విద్యుత్ దీపాలు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇలా చేరుకోవచ్చు..

విశాఖపట్నం వచ్చే భక్తులు సింహాచలం, ఆనందపురం, తగరపువలస మీదుగా పద్మనాభం చేరుకోవచ్చు. విశాఖ నుంచి 222కె బస్సు ఉంది. ఇది తగరపువలస మీదుగా పద్మనాభం వస్తుంది. తగరపువలస, ఆనందపురం నుంచి ఆటోల్లో రావచ్చు. సింహాచలం, విజయనగరం నుంచి ప్రతి పది నిమిషాలకు పల్లె వెలుగు, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి. సింహాచలం ఆర్‌టీసీ డిపో ప్రత్యేక బస్సులు నడపనుంది.

సింహగిరిపై ఘనంగా శ్రీనృసింహ హోమం




హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: స్వాతి నక్షత్రం సందర్భంగా సింహగిరిపై ఆదివారం శ్రీనృసింహ హోమం ఘనంగా జరిగింది. ఆన్‌లైన్‌లో కూడా టికెట్లు అందుబాటులో ఉంచడంతో ఈసారి పెద్ద ఎత్తున ఉభయదాతలు హోమంలో పాల్గొన్నారు. ఉదయం 7 గంటలకు చక్రపెరుమాళ్లను వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య ఆలయంలోంచి ఊరేగింపుగా కల్యాణ మండపం వద్దకు తీసుకొచ్చి హోమ గుండం వద్ద అధిష్టింపజేశారు. యాగంలో పాల్గొన్న ఉభయదాతలకు కంకణధారణ చేసి ఆశీనింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కలశారాధన, అగ్నికార్యం జరిపారు. అనంతరం నృసింహ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశను ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామివారి మూలవిరాట్‌కు సమర్పించారు. తదుపరి ఆ జలాలను భక్తులపై చల్లారు. దేవస్థానం తరపున ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సుబ్బారెడ్డి, జస్టిస్ రాజశేఖర్ హోమాన్ని తిలకించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు పాల్గొన్నారు.

పాదయాత్రగా వెళ్లి.. దుర్మరణం పాలై..

- క్రేన్ ఢీకొని అయ్యప్ప స్వామి దుర్మరణం
- సింహాచలం వెళ్తుండగా ఘటన



బెహరా మురళి (ఫైల్)



ప్రమాదానికి కారణమైన క్రేన్

అక్కిరెడ్డిపాలెం: అతను స్వామి అయ్యప్ప మాల వేశారు. నిత్యం ఎంతో నిష్ఠతో పూజలు చేస్తున్నారు. మాలలో ఉండగానే పాదయాత్రగా వెళ్లి శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఆదివారం పాదయాత్రగా సింహాచలం బయలుదేరిన ఆయన.. మార్గమధ్యంలోనే దుర్మరణం పాలయ్యారు. క్రేన్ రూపంలో ఆయన్ని మృత్యువు కబళించింది. గాజువాక ట్రాఫిక్ ఎస్ఐ షేక్ యూసఫ్ తెలిపిన వివరాలివీ.. గాజువాక సింహగిరి కాలనీకి చెందిన బెహరా మురళి(67) కోరమండల్‌లోని మణికంఠ కన్‌స్ట్రక్షన్‌లో సివిల్ కాంట్రాక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. అతను స్వామి అయ్యప్ప మాలధారణ చేశారు. ఆదివారం ఉదయం సింహాచలం లక్ష్మీ నృసింహస్వామిని దర్శించుకునేందుకు పాదయాత్రగా బయలుదేరారు. పాతగాజువాక నుంచి షీలానగర్ వైపు వచ్చిన ఆయన.. చట్టివానిపాలెం, ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ మధ్యలో రోడ్డు పక్కన నడుస్తున్నారు. ఆ సమయంలో ఆటోనగర్ నుంచి వస్తున్న క్రేన్ మురళిని ఢీ కొట్టి అతనిపై నుంచి వెళ్లిపోయింది. దీంతో ఆయన అక్కడికక్కడే దుర్మరణం చెందారు.

సమాచారం అందుకున్న ఎస్ఐ షేక్ యూసఫ్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన నాతయ్యపాలేనికి చెందిన హైడ్రా క్రేన్ ఆపరేటర్ అక్కిరెడ్డి దేముడును అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. మృతుడికి భార్య వరలక్ష్మి, వివాహితులైన కుమారుడు సతీష్, కుమార్తెలు రమ, వరలక్ష్మి ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.